సాక్షి
సిద్దిపేట
మంగళవారం ၊ 29 ၊ ఆగస్టు ၊ 2023



బేరసారాలు
లక్కీ డ్రాలో మద్యం లైసెన్స్ దక్కించుకున్న వారికి కాసుల పంట పండుతోంది. ఆశావహులు లక్షలు చెల్లించి దుకాణాలను సొంతం చేసుకుంటున్నారు. 8లో..



షీటీమ్స్‌తో మహిళలకు భరోసా
షీ టీమ్స్ ద్వారా మహిళలకు, బాలికలకు సత్వర న్యాయం అందుతుందని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. 8లో..



గుట్టలను మింగేస్తున్నారు..!
ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేస్తున్నారు. గుట్టలు, ప్రభుత్వ, పోరంబోకు, అసైన్డ్, వాగు భూములను దర్జాగా ఆక్రమి ంచేస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదు. 9లో..

న్యూస్‌రీల్

జిల్లాలో యూరియా కొరత లేదు



గణేశ్‌పల్లిలోని ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

మర్కూక్(గజ్వేల్): జిల్లాలో యురియా కొరత లేదని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని గణేశ్‌పల్లిలో అగ్రిస్ రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇటీవల వర్షాలు కురవడంతో వరి, మొక్కజొన్న పత్తి పంటలకు ఎరువులు వేస్తున్నారని తెలిపారు. యూరియా ఎక్కువగా వాడడం వల్ల రైతులకు నష్టం తప్ప లాభం లేదన్నారు. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులను వాడాలన్నారు. ఎక్కువ వాడడం వల్ల పంటకు నష్టం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఏఓ నాగేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమల అభివృద్ధికి కృషి



గొర్రెలను పంపిణీ చేస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్(గజ్వేల్): గొల్ల కురుమ యాదవుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దౌలాపూర్‌కు చెందిన గొల్ల, కురుమ, యాదవులకు రెండో విడత గొర్రెలను 12 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెలతో ఉపాధి పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అలాగే రాయితీపై గొర్రెలను పంపిణీ చేసిన ప్రభుత్వాన్ని మరిచిపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, సర్పంచ్ యాదిలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, పీర్లపల్లి సర్పంచ్ యాదవరెడ్డి, ఉపసర్పంచ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరికాయల విక్రయానికి టెండర్లు



టెండర్లను పరిశీలిస్తున్న ఆలయ ఈఓ బాలాజీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో కొబ్బరికాయలు అమ్ముకునేందుకు ఆలయ అధికారులు సీల్డ్ టెండర్లు సోమవారం నిర్వహించారు. దేవస్థానం పరిధిలో నాలుగు దుకాణాలకు టెండర్లు పిలువగా రెండు దుకాణాలకు దాఖలు చేశారు. మొదటి దుకాణానికి రూ.5లక్షల 2వేలను కోడ్ చేసి సార్ల కిష్టయ్య, రెండో దుకాణాన్ని రూ.5లక్షల10 వేలు కోడ్ చేసి అంబటి పల్లి వీరేశంలు దక్కించుకున్నారు. దాఖలు కాని దుకాణాలకు త్వరలోనే తిరిగి టెండర్లు నిర్వహిస్తామని ఆలయ ఈవో బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఏఈవో అంజయ్య, సూపరింటెండెంట్ నీల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాంకాల నవీన్‌కు నంది అవార్డు



ప్రతిభా బంగారు నంది అవార్డును స్వీకరిస్తున్న మాంకాల నవీన్‌కుమార్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని సంతోషిమాత ఆలయ చైర్మన్ మాంకాల నవీన్‌కుమార్ ప్రతిభ బంగారు నంది అవార్డు అందుకున్నారు. మంజునాథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రతిభా బంగారు నంది అవార్డుల పంపిణీ కార్యక్రమంలో సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞ శర్మ, మంజునాథ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మంజుల గౌడ్‌ల చేతుల మీదుగా అవార్డును నవీన్‌కుమార్ అందుకున్నారు. మంజుల గౌడ్ మాట్లాడుతూ నవీన్ కుమార్ పలు సేవా సంస్థలైన వాసవీ క్లబ్స్, ఆర్యవైశ్య మహాసభ, లయన్స్ క్లబ్స్, అమర్నాథ్ అన్నదాన సేవా సమితి, కేదార్నాథ్ అన్నదాన సేవా సమితి ఇలా పలు సేవా సంస్థల ద్వారా సేవలను అందిస్తున్నారన్నారు.

పొత్తుకు రెడీ!



- హస్తం పెద్దలతో వామపక్షాల చర్చలు
- హుస్నాబాద్ సీటు కోసం సీపీఐ పట్టు
- ఆ ఇద్దరి ఆశలు గల్లంతేనా?
- మారుతున్న రాజకీయ సమీకరణాలు

సాక్షి, సిద్దిపేట: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పొత్తు దిశగా అడుగులు పడుతున్నాయి. ఇటీవల రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో సీపీఐ రాష్ట్ర నేతలు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీపీఐ కోరిన వాటిలో హుస్నాబాద్ అసెంబ్లీ స్థానం ఉన్నట్లు తెలిసింది. పొత్తులు ఉంటే ఎవరి ఆశలు గల్లంతు అవుతాయోనని జిల్లా వ్యాప్తంగా చర్చ సాగుతోంది. మునుగోడు ఎన్నికల నుంచి ఏడాదిన్నర పాటు బీఆర్ఎస్‌తో సీపీఐ పొత్తు ఉంటుందని చర్చ సాగింది. అయితే పొత్తు లేకుండానే బీఆర్ఎస్ టికెట్లను కేటాయించడంతో సీపీఐ ఆశలు గల్లంతయ్యాయి. తాజాగా కాంగ్రెస్‌తో సీపీఐ చర్చలు జరుపుతోంది. దీంతో ఏఏ సీట్లు ఎవరికి కేటాయిస్తారో చర్చ హాట్ హాట్‌గా జరుగుతోంది.

గతంలోనే పోటీపై ప్రకటన

సీపీఐ పొత్తు ఎవరితో ఉన్నా హుస్నాబాద్ సీటు కోసం పట్టుపడుతోంది. కాంగ్రెస్‌తో పొత్తులో సైతం హుస్నాబాద్ సీటు కావాలని కోరుతున్నారు. ఈ నియోజకవర్గం ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. ఇందుర్తి నుంచి సీపీఐ నాయకులు దేశిని చిన మల్లయ్య ఐదుసార్లు, చాడ వెంకట్‌రెడ్డి ఒకసారి విజయం సాధించారు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తులో భాగంగా సీపీఐకి కేటాయించగా చాడ వెంకట్ రెడ్డి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. గతేడాది నుంచి సీపీఐ నేతలు హుస్నాబాద్‌లో మకాం వేసి ప్రజాసమస్యలపై పోరాటాలు చేస్తున్నారు. సీపీఐ బస్సు యాత్ర ముగింపు సభను గత మే నెలలో హుస్నాబాద్‌లోనే నిర్వహించారు. ఆ సభలో సీపీఐ పోటీ చేస్తుందని ప్రకటించారు.

పొత్తు కుదిరితే..

సీపీఐతో కాంగ్రెస్ పొత్తు కుదిరి సీపీఐకి హుస్నాబాద్ సీటు కేటాయిస్తే కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశిస్తున్న ఇద్దరు నేతల ఆశలు గల్లంతుకానున్నాయి. ఇక్కడి నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డిలు టికెట్ ఆశిస్తున్నారు. 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ప్రవీణ్ రెడ్డి గెలుపొందారు. కొంత కాలంగా గడప గడపకు కాంగ్రెస్ పేరుతో నియోజకవర్గంలో పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రతి పార్లమెంట్ పరిధిలో ఇద్దరు బీసీలకు టికెట్ల అవకాశం కల్పించాలని కాంగ్రెస్ నిర్ణయించడంతో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ దృష్టి హుస్నాబాద్‌పై పడినట్లు తెలిసింది. ఇప్పటికే గ్రౌండ్ వర్క్‌ను పొన్నం మొదలు పెట్టారు. కాంగ్రెస్ నాయకులతో నిత్యం టచ్‌లో ఉంటూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

హుస్నాబాద్‌లో పోటీ చేసేది కాంగ్రెస్సే



మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కాంగ్రెస్, వామపక్ష పార్టీల మధ్య పొత్తుల పై చర్చలు జరుగుతున్నాయని, కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎట్టి పరిస్థితుల్లో హుస్నాబాద్‌లో కాంగ్రెస్సే పోటీ చేస్తుందని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. సీపీఐకి టికెట్ ఇస్తే జరిగే నష్టాలను అధిష్టానానికి వివరిస్తామన్నారు. ఇద్దరి మధ్య స్నేహపూర్వక పోటీ ఉంటుందన్నారు. హుస్నాబాద్‌ను బలవంతంగా సిద్దిపేటలో విలీనం చేశారని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కోహెడ మండలాన్ని రెండు మండలాలుగా చేసి వారి అభీష్టం మేరకు కరీంనగర్ జిల్లాలో కలుపుతామని అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని, ఎమెల్యే సతీష్‌కుమార్ అసమర్థతే కారణమని ప్రభాకర్ అన్నారు. పదేళ్లు గడుస్తున్నా గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయలేదని అన్నారు. సీఎం కేసీఆర్ దత్తత గ్రామం ముల్కనూర్‌లో మంజూరు చేసిన డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం మానవ హక్కుల సంఘం వద్దకు వెళితే తప్పా పూర్తి కాలేదన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శి చిత్తారి రవీందర్, వివిధ మండలాల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమిద్దాం

సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు



మాట్లాడుతున్న చుక్క రాములు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతుల్లో భాగంగా సోమవారం సిద్దిపేటలో నిర్వహించిన తరగతులకు చుక్కరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ మతోన్మాదులుగా బీజేపీ నాయకులు ప్రవర్తిస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే మణిపూర్ రాష్ట్రంలో హింసలను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రప్రభుత్వ తీరుతో దేశంలోని పరిశ్రమలన్నీ మూతపడుతున్నాయి. దీంతో ఉన్న ఉద్యోగాలు పోయి లక్షలాదిమంది ప్రజలు రోడ్డునపడ్డారన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రజాస్వామిక, లౌకికవాదులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. మొదటి రోజు 'అంతర్జాతీయ - జాతీయ పరిణామాలు'పై శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి అబ్బాస్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాల స్వామి, మండల కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రై సైకిళ్ల కోసం 30న దివ్యాంగుల ఎంపిక

దుబ్బాక: బ్యాటరీతో నడిచే ట్రై సైకిళ్ల పంపిణీ కోసం ఈ నెల 30న దుబ్బాక నియోజకవర్గానికి చెందిన దివ్యాంగులను ఎంపిక చేయనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర వికలాంగుల సంస్థ హైదరాబాద్, ఏఎల్ఐఎంసీఓ సంస్థ నిపుణుల సహకారంతో మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ ఎంపిక శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. వైకల్యం 80 శాతం పైబడి, నెలసరి ఆదాయం రూ.15 వేలు మించని వారు అర్హులని తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యే దివ్యాంగులు తమ సదరం సర్టిఫికెట్‌తో పాటు ఆధార్ కార్డును తమ వెంట తీసుకురావాలని సూచించారు.

నాణ్యమైన వస్తువులే వినియోగించాలి

ఇండియన్ స్టాండర్స్ కమిటీ జాయింట్ డైరెక్టర్ తన్నీరు రాకేష్

కొండాపూర్(సంగారెడ్డి): ప్రతిఒక్కరూ ప్రభుత్వం గుర్తింపు పొందిన నాణ్యత కలిగిన వస్తువులనే వాడాలని ఇండియన్ స్టాండర్స్ కమిటీ జాయింట్ డైరెక్టర్ తన్నీరు రాకేష్ విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణంలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వస్తువుల నాణ్యతపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ, క్వాలిటీని గుర్తించడానికి భారత ప్రభుత్వం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ వస్తువులనే ఉపయోగించేటట్లు విద్యార్థులు అవగాహన కల్పించాలన్నారు. అప్పుడే మార్కెట్‌లో కల్తీలను నిషేధించే అవకాశం ఉంటుందన్నారు.

పారిశ్రామికవాడల్లో గంజాయి దందా



బొల్లారంలో స్వాధీనం చేసుకున్న చాక్లెట్లు

- యువతే లక్ష్యంగా వ్యాపారం
- చోద్యం చూస్తున్న అధికారులు

జిన్నారం(పటాన్‌చెరు): పారిశ్రామిక వాడల్లో గంజాయి దందా జోరుగా సాగుతోంది. యువతే లక్ష్యంగా వ్యాపారం కొనసాగుతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తులు ఇటీవల మత్తెక్కించే చాక్లెట్లను గుట్టుగా పాన్ షాపుల్లో విక్రయిస్తున్నారు. ఏళ్ల నుంచి ఈ వ్యాపారం పారిశ్రామిక వాడల్లో జోరుగా జరుగుతోంది. జిల్లావ్యాప్తంగా పటాన్‌చెరు, పాశమైలారం, హత్నూర, జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం, ఖాజీపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి తదితర మండలంలోని పారిశ్రామికవాడల్లో కొన్ని వేల పరిశ్రమలున్నాయి. బిహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి కార్మికులు పని చేసేందుకు వస్తుంటారు. కొంతమంది వ్యక్తులు వీరిని దృష్టిలో ఉంచుకొని చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయాలు చేస్తున్నారు. బొల్లారం పారిశ్రామికవాడలోని చేపల మార్కెట్, వైఎస్సార్ కాలనీ, శ్రీరాంకాలనీ, బీసీ కాలనీ, పోచమ్మ బస్తీల్లో ఎక్కువగా విక్రయిస్తున్నారు. పరిచయస్తులకే విక్రయిస్తుండటంతో ఇక్కడి యువకులు ఇతర రాష్ట్రాలవారితో సఖ్యతగా ఉండి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని కేసీఆర్ కాలనీ, అల్లీనగర్, దాచారంల్లోనూ, పలు పాన్ షాపుల్లోనూ లభిస్తుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. ఇటీవల పటాన్‌చెరు పారిశ్రామిక వాడల్లో పలువురు విక్రయిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పాన్‌షాపుల్లో సైతం..

తాజాగా కొన్ని పాన్‌షాపుల్లో ఎక్కువగా మత్తు చాకెట్ల విక్రయాలు జరుగుతున్నాయి. రూ.10కే చాక్లెట్ విక్రయిస్తున్నారు. గతంలో ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అధికారులు ఇటువైపు చూడక పోవటంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. ఏళ్లుగా ఇక్కడ సరఫరా అవుతున్న పోలీసులు, ఎక్సైజ్‌శాఖ అధికారులు తీసుకుంటున్న చర్యలు నామామాత్రంగా ఉన్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిఘా పెట్టాం

పారిశ్రామిక వాడల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్న విషయం మా దృష్టికి రాలేదు. గతంలో చాలా మంది విక్రేతలను అరెస్టులు చేశాం. ఈ ప్రాంతాల్లో తగిన నిఘా ఏర్పాటు చేసి నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం.

సీతారాంరెడ్డి, ఎక్సైజ్ సీఐ పటాన్‌చెరు

సంక్షేమ పథకాల అమలు వేగిరం

కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

సిద్దిపేటరూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేస్తున్నామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పలు సంక్షేమ పథకాల అమలును వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హరిత హారం, గృహలక్ష్మి, ఇంటిపట్టాల పంపిణీ, జీఓ 59, నోటరి భూముల క్రమబద్ధీకరణ, బీసీ, మైనారిటీ సాయం, గొర్రెల పంపిణీ, దళిత బంధు వంటి అంశాలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జేపీఎస్‌ల రెగ్యులరైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిస్థాయిలో కొనసాగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, శ్రీనివాస్‌రెడ్డి, డీఎఫ్ఓ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఐఓసీ భవనాన్ని పూర్తి చేయండి

దుబ్బాకటౌన్: ఐఓసీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఆదేశించారు. సోమవారం పట్టణంలో నిర్మిస్తున్న ఐఓసీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నాయని ఐఓసీ భవనంలోనే దుబ్బాక నియోజకవర్గం ఆర్‌ఓ కార్యాలయం ఏర్పాటు చేస్తామన్నారు. పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సీఎం సమక్షంలో చేరిక



సిద్దిపేట పట్టణానికి చెందిన క్రికెటర్ ఇఫ్తెకర్, ఆయన కుమారుడు ఆరిఫుద్దీన్ సోమవారం బీఆర్ఎస్‌లో చేరారు. ప్రగతి భవన్‌లో వారికి సీఎం కేసీఆర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. - సిద్దిపేట జోన్

అర్జీలను సత్వరం పరిష్కరించండి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో వచ్చే అర్జీలన్నింటినీ పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తులను డీఆర్‌ఓ నాగరాజమ్మతో కలిసి అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఒకే సమస్యపై బాధితులు ప్రజావాణికి మళ్లీ రాకుండా చూడాలన్నారు. భూమి, అసరా, డబుల్‌బెడ్రూం ఇళ్లకు సంబంధించి మొత్తంగా 53 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంల నిరసన



సిద్దిపేట పట్టణంలో ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

సిద్దిపేటకమాన్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సెకండ్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. సిద్దిపేట అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. వీరికి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ సంఘీభావం తెలిపారు. సెకండ్ ఏఎన్ ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

కనీస వేతనాలు అమలు చేయాల్సిందే

- విద్యాశాఖ సమగ్రశిక్షా ఉద్యోగుల డిమాండ్
- కలెక్టరేట్ ఎదుట నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కనీస వేతన స్కేలును అమలు చేయాలని విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి బీజేఆర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అంతకు ముందు మంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంలో, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు మాట్లాడుతూ 15 ఏళ్లుగా విద్యాశాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు సమాన విధులు నిర్వహిస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రల్లో విద్యాశాఖ సమగ్రశిక్షణ ఉద్యోగులను రెగ్యులర్ చేశారని, కొన్ని రాష్ట్రాల్లో కనీస వేతన స్కేలును అమలు చేస్తున్నారన్నారు. ఇతర శాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తున్న విధంగా తమను రెగ్యులర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుండిగల్ యాదగిరి, రాష్ట్ర ముఖ్య సలహాదారు సురేందర్, జిల్లా అధ్యక్షుడు బాలకిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, జిల్లా కోశాధికారి కరుణాకర్, మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి, ఉపాధ్యక్షులు యాదగిరి, రాజ్యలక్ష్మి, రఘురాం, ముఖ్య సలహాదారు వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శి రాజు, సద్గుణ, ప్రచార కార్యదర్శి రమేష్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహాధర్నాకు తరలిరావాలి


సభ్యత్వ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్ కిరణ్ ఆరోపించారు. సోమవారం మండలంలోని వివిధ పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించాలని కోరారు. కేజీబీవీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. సెప్టెంబర్ 1న నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు శివుడు, ప్రధాన కార్యదర్శి రాజనర్సింహ, రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ మాయం

దుబ్బాక: హనుమాన్ దేవాలయంలో హుండీని దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన దుబ్బాక మున్సిపల్ పరిధి ధర్మాజీపేట వార్డులో జరిగింది. దుబ్బాక ఎస్సై గంగరాజు వివరాలు. ధర్మాజీపేట వార్డుకు చెందిన విజయ లక్ష్మణశర్మ హనుమాన్ ఆలయంలో అర్చకుడిగా పని చేస్తున్నాడు. రోజులాగే ఆదివారం ఉదయం పూజా కార్యక్రమాలు నిర్వహించి ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి హుండీ కనిపించలేదు. విషయాన్ని కౌన్సిలర్ బత్తుల స్వామికి తెలిపారు. స్థానికులతో వెతికి చూడగా ఎక్కడా కనపడలేదు. హుండీలో రూ.2వేల వరకు ఉంటాయని ఎస్సై తెలిపారు. అర్చకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గంజాయి కేసులో పదేళ్ల జైలు


సిద్ధయ్య(ఫైల్)

రామాయంపేట(మెదక్): గంజాయి కేసులో మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన కుంట సిద్ధయ్యకు కోర్టు జైలుశిక్షతో పాటు జరిమానా విధించింది. స్థానిక ఎక్సైజ్ ఎస్ఐ విజయ్ సిద్దార్థ వివరాలు. 2017లో సిద్ధయ్య వద్ద 410 గ్రాముల గంజాయితో పాటు ఐదు మొక్కలను అప్పటి ఎక్సైజ్ సీఐ రాధాకిషన్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితుడికి పదేళ్ల జైలు, రూ.25వేల జరిమానా విధిస్తూ మెదక్ ఏడీజే కోర్టు మెజిస్ట్రేట్ లక్ష్మీశారద తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ చెప్పారు. ఈ మేరకు నిందితుడిని సంగారెడ్డి జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు.

సోనియా చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీల కోసం చేసిన డిక్లరేషన్ సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద సోమవారం కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీలకు 12 అంశాలతో కూడిన డిక్లరేషన్ ప్రకటించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, యువరాజ్, కిషన్, వడ్డే గోపాల్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

బేరసారాలు



చేతులు మారుతున్న వైన్ షాప్‌లు

- లైసెన్స్ పొందినవారికి గుడ్‌విల్ ఆఫర్
- కుదరకపోతే పార్ట్‌నర్‌షిప్ కోసం ప్రయత్నాలు

లక్కీ డ్రాలో మద్యం లైసెన్స్ దక్కించుకున్న వారికి కాసుల పంట పండుతోంది. డ్రాలో షాపులు వచ్చినవారికి లిక్కర్ వ్యాపారులు పోటాపోటీగా గుడ్‌విల్ ఆఫర్ చేస్తున్నారు. లక్షల రూపాయలు చెల్లించి అయినా దుకాణాలు పొందేందుకు సిద్ధమవుతున్నారు. బేరం కుదరకపోతే ఆఖరికి పార్ట్‌నర్‌షిప్ అయినా ఇవ్వాలని కోరుతున్నారు.

సాక్షి, సిద్దిపేట: మద్యం వ్యాపారంలో అదృష్టవంతులెవరో తెలిపోయింది. లక్కీ డ్రా ద్వారా వైన్ షాప్‌లను దక్కించుకున్నారు. షాప్‌ల కేటాయింపు జరగడంతో డిసెంబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ ప్రారంభం కానుంది. అయితే లక్కీ డ్రాలో మద్యం దుకాణాలు పొందనివారు నిరాశకు గురయ్యారు. అయినా చివరిప్రయత్నాలు చేస్తున్నారు. వైన్ షాపు దక్కించుకున్నవారితో బేరసారాలు చేస్తున్నారు. గుడ్‌విల్ ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు. కొంతమంది మద్యం వ్యాపారులు, రాజకీయ పార్టీలకు చెందిన నేతలు లక్షల రూపాయలు చేత పట్టుకొని వైన్ షాప్‌ల కోసం ట్రై చేస్తున్నారు. లక్కీ డ్రా ద్వారా వైన్ షాప్‌లను దక్కించుకున్న వారికి డబ్బులు ఆశ చూపిస్తున్నారు. వారి ఇంటి చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు.

గుడ్ విల్

జిల్లాలో మొత్తం 93 వైన్ షాప్‌లుండగా 4,166 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఎక్సైజ్ శాఖకు రూ 83.32 కోట్ల ఆదాయం లభించింది. ఈ నెల 21న విపంచిలో లక్కీ డ్రా ద్వారా వైన్ షాపులను కేటాయించారు. కొన్నేళ్లుగా మద్యం వ్యాపారం చేస్తున్న వారికి, రాజకీయ నాయకులకు తక్కువ మందికి షాపులు దక్కాయి. కొత్తవారికి అదృష్టం వరించింది. ఇటు నేతలు...అటు వ్యాపారులు వైన్ షాప్‌ల కోసం లక్కీ డ్రా ద్వారా టెండర్లు దక్కించుకున్న వారి వెంట పడుతున్నారు. గుడ్ విల్ ఇచ్చి షాప్‌ను దక్కించుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. గుడ్ విల్‌కు ఒప్పుకోకపోతే చివరకు పార్ట్‌నర్ షిప్ అయినా ఇవ్వండని ఒప్పందాలకు దిగుతున్నారు. దీంతో లక్షల రూపాయలు డబ్బు చేతులు మారుతుంది.

> సిద్దిపేట పట్టణంలో అత్యధికంగా వ్యాపారం జరిగే ఓ వైన్ షాప్‌ను రూ 1.1కోట్లను గుడ్ విల్ ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే గజ్వేల్‌లో ఓ వైన్ షాప్ కొనుగోలు చేసేందుకు బేరాలు నడుస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

డిసెంబర్ 1 నుంచి కొత్త పాలసీ

2023–2025 సంవత్సరాలకు మద్యం షాప్‌లు లక్కీ డ్రా ద్వారా వచ్చిన వ్యాపారులు డిసెంబర్ 1 నుంచి ప్రారంభించనున్నారు. ఇప్పటికే వైన్ షాప్ దక్కిన వారు ఎక్సైజ్ ట్యాక్స్‌లో 1/6వ వంతు డబ్బును చాలాన చెల్లించారు. 2021–2023 సంవత్సరాలకు సంబంధించిన మద్యం లైసెన్స్ నవంబర్ 30వ తేదీతో ముగియనుంది.

మా దృష్టికి రాలేదు



వైన్స్ షాప్‌లు గుడ్ విల్ ఇచ్చి తీసుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు. డ్రాలో వచ్చిన వ్యక్తి పేరుమీదనే లైసెన్స్‌ను జారీ చేస్తాం. షాప్‌కు సంబంధించిన అన్ని బాధ్యతలు లైసెన్స్ దారునిదే. షాప్‌నకు సంబంధించిన ఏదైనా చర్యలు ఉంటే లైసెన్స్‌దారుని పైనే తీసుకుంటాం.

–శ్రీనివాసమూర్తి, ఎక్సైజ్ సూపరింటెండెంట్

షీటీమ్స్‌తో మహిళలకు భరోసా

సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత


మహిళ పోలీసు స్టేషన్ సీఐ దుర్గను అభినందిస్తున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: షీ టీమ్స్ ద్వారా మహిళలకు, బాలికలకు సత్వర న్యాయం చేయడం జరుగుతుందని సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత అన్నారు. అడిషనల్ డీజీపీ ఉమెన్ సేఫ్టీ వింగ్ హైదరాబాద్ వారు జూలై 2023 నివేదికలో సిద్దిపేట జిల్లా షీటీమ్స్ రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచినందున సిబ్బందికి సీపీ కార్యాలయంలో సోమవారం నగదు రివార్డు, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. అవేర్‌నెస్ కార్యక్రమాల్లో సిద్దిపేట జిల్లా షీటీమ్ రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో, వెస్ట్ జోన్‌లో మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. మహిళలు, బాలికల రక్షణకు ఉన్న చట్టాల గురించి మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి పాఠశాల, కళాశాల ఆవరణలో క్యూఆర్ కోడ్ ఉన్న పేపర్‌ను అతికించాలని సూచించారు. షీటీమ్ ద్వారా నమోదు చేసిన పెట్టి కేసులలో నిందితులకు శిక్షలు పడేలా చూడాలని సిబ్బందికి సూచించారు. వీటి గురించి ప్రతీరోజు మానిటర్ చేయాలని మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గకు సూచించారు. సిద్దిపేట షీటీమ్ వాట్సాప్ నెంబర్ 8712667434, స్నేహిత మహిళ సపోర్ట్ సెంటర్ 9494639498, సిద్దిపేట మహిళ పోలీసు స్టేషన్ 8712667435నెంబర్లకు ఫోన్ చేసి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీలు అడ్మిన్ శ్రీనివాసరావు, లాఅండ్ ఆర్డర్ మల్లారెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ దుర్గ, ఏఎస్ఐలు ముజీబ్, మహిళా కానిస్టేబుళ్లు పద్మ, సంగీత, జ్యోతి, రజిత, స్వప్న, కానిస్టేబుళ్లు స్వామి, ప్రకాష్, అన్వేష్, యుగంధర్, మహేష్,, రవి పాల్గొన్నారు.

అందరూ సమానమే..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆడమగ అనే తేడా ఉండరాదని, అందరూ సమానంగా ముందుకు సాగినపుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. స్పార్ట్ స్వచ్ఛంద సంస్థ, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల నుంచి జండర్ సెన్సిటైజేషన్ ఫర్ యూత్ పేరుతో 60 మంది అమ్మాయిలకు వర్క్ షాప్ నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి సీపీ శ్వేత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో స్పార్ట్ స్వచ్ఛంద సంస్థ సీఈవో శివకుమారి, జండర్ సెన్సిటైజేషన్ స్పెషలిస్ట్ గిరిజారాణి పాల్గొన్నారు.

ఆలయం కూల్చిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకుల వినతి


అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: అర్బన్ మండల పరిధిలోని మిట్టపల్లి గ్రామానికి చెందిన మెరుపు గుట్టపై అక్రమ తవ్వకాలు చేసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని కూల్చిన వారిపై చర్యలు తీసుకుకోవాలని సోమవారం విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ మెదక్ విభాగ్ సహకార్యదర్శి రాజారాం మాట్లాడుతూ కొద్ది నెలలుగా మిట్టపల్లి మెరుపుగుట్ట వద్ద అక్రమ తవ్వకాలు చేయడంతో పాటు పైన ఉన్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని కూల్చివేశారని, ప్రభుత్వం స్పందించి వారిని శిక్షించాలని కోరారు. కూల్చివేసిన ఆలయాన్ని పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మిట్టపల్లి నవీన్ పాల్గొన్నారు.

వైభవంగా బంగారమ్మ జాతర


దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ బంగారమ్మ జాతర ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి గంప ఊరేగింపు, పోతరాజు గావు, రంగం కార్యక్రమాలను జరిపారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు దీరారు. కార్యక్రమాల్లో పూజారి వేణుగోపాల్‌శర్మ, సర్పంచ్ నత్తి మల్లేశ్ పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలి


మాట్లాడుతున్న జిల్లా ఇంచార్జి జడ్జి సుదర్శన్

సంగారెడ్డి టౌన్: రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలని జిల్లా ఇంచార్జి ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ అన్నారు. సోమవారం జిల్లా కోర్టులో సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, జోగిపేట్ న్యాయవాదులతో వచ్చే నెల 9వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌పై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారుల మధ్య రాజీ కుదిర్చి కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించాలని అన్నారు. జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసే బీఆర్ఎస్‌లోకి వలసలు


బీఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి పనులతో బీఆర్ఎస్‌లోకి వలసలు పెరుగుతున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని తలారువానిపల్లె గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రాజాబాబు, వెంకటేష్, రజనీకాంత్, అమర్, పవన్ తదితరులు సోమవారం బెజ్జంకి పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల లక్ష్మణ్, మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్త, సర్పంచ్‌లు సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మొండయ్య తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

తాగుడుకు బానిసై..


గణేష్(ఫైల్)

హవేళీఘనపూర్: తాగుడుకు బానిసైన ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండల పరిధిలోని ఔరంగాబాద్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన లక్ష్మీశ్రీనివాస్‌ల కుమారుడు గణేష్ (24) కొంతకాలంగా మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతుండేవాడు. ఈ విషయంలో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటన స్థలాన్ని హవేళీఘనపూర్ పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి కావడం లేదని..


శ్రీకాంత్‌రెడ్డి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): పెళ్లికావడం లేదని జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోమవారం రాత్రి వర్గల్ మండలం వేలూరులో జరిగింది. గౌరారం ఎస్సై విజయభాస్కర్ వివరాలు. వేలూరుకు చెందిన చీదు జనార్దన్‌రెడ్డి, బాలమణి దంపతులకు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఇద్దరు కొడుకులున్నారు. పెద్దకొడుకు వివాహమైంది. వ్యాపారం చేసుకుంటున్నాడు. చిన్నకొడుకు శ్రీకాంత్‌రెడ్డి(32)కి ఇంకా పెళ్లి కాలేదు. సంబంధాలు కుదరడం లేదు. దీంతో మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతీ పల్లెలో ఏరులై పారుతున్న మద్యం

బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర


మాట్లాడుతున్న బీదర్ ఎమ్మెల్యే శైలేంద్ర


జహీరాబాద్‌లో బీజేపీ బైక్ ర్యాలీ

జహీరాబాద్ టౌన్: ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం మద్యానికి బానిసలుగా చేసిందని జహీరాబాద్ ఇంచార్జి బీదర్ బీజేపీ ఎమ్మెల్యే శైలేంద్ర బెళదలే ఆరోపించారు. ప్రవాజ్ యోజనలో భాగంగా సోమవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. ఆయన స్వయంగా బైక్ నడిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ పల్లెలో చూసినా మద్యం షాపులు దర్శనిమిస్తున్నాయని, సారా ఏరులై పారుతుందని ఆరోపించారు. కేసీఆర్ ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదన్నారు. రైతు బంధు కూడా ఇంతవరకు పూర్తిగా ఇవ్వలేదని, రుణ మాఫీ కూడా మొక్కు బడిగా కొనసాగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాం చందర్ రాజనర్సింహ్మా, జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథ్, అధికార ప్రతినిధి చింతల్ ఘాట్ సుధీర్ కుమార్, మల్లికార్జున్, జనార్దన్‌రెడ్డి, సుధీర్, ప్రశాంత్ పాటిల్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం


మణికుమార్‌శర్మ (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం కేసు నమోదైంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాలు. హైదరాబాద్ మౌలాలికి చెందిన మణికుమార్ శర్మ(34) బంజారాహిల్స్‌లో చార్టెడ్ అకౌంట్‌గా పని చేస్తుంటాడు. రెండు రోజుల క్రితం పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామ పరిధిలోని లైఫ్‌స్టైల్ వెంచర్‌లో ఉంటున్న అత్తగారింటికి భార్య చేతనతో కలిసి వచ్చాడు. ఈ క్రమంలో ఆదివారం అత్తాపూర్‌కు వెళ్తున్న అని చెప్పిన మణికుమార్ శర్మ తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. సోమవారం అతని భార్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగానికి దంపతుల బలి

- రెండు బైకులను ఢీకొట్టిన కారు
- మరొకరి పరిస్థితి విషమం


నవీన్ కుమార్, సుజాత (ఫైల్)

నర్సాపూర్ రూరల్: అతివేగం, అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. రెండు బైకులను కారు ఢీ కొట్టిన సంఘటన నర్సాపూర్–మెదక్ జాతీయ రహదారిలోని మూతపడిన షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం జరిగింది. ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. నర్సాపూర్ ఎస్సై శివకుమార్ వివరాలు. సంగారెడ్డి జిల్లా నిజాంపేట్ మండలం శాఖాపూర్ గ్రామానికి చెందిన గడ్డమీది నవీన్ కుమార్(28), భార్య సుజాత (26)లు బైక్ పై నర్సాపూర్ మీదుగా హైదరాబాద్ వెళ్తున్నారు. మరో బైక్‌పై నర్సాపూర్ మండలం పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన కట్ట కరుణాకర్ నర్సాపూర్ వైపు వస్తున్నాడు. హైదరాబాద్ నుంచి నర్సాపూర్ మీదుగా మెదక్ వైపు అతివేగంగా వెళ్తున్న కారు ఈ రెండు బైకులను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నవీన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా అతని భార్య నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందింది. మరో బైక్ పై వెళ్తున్న కరుణాకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. దంపతుల మృతదేహాలను నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవనోపాధి కోసం....

జీవనోపాధి కోసం నవీన్ కుమార్ హైదరాబాద్ రామచంద్రపురంలో అద్దె ఇంట్లో ఉంటూ ఫొటో ఫ్రేమ్ షాపును నిర్వహిస్తున్నాడు. అతని తల్లిదండ్రులు వృద్ధులైన లింగయ్య, శ్యామమ్మ స్వగ్రామమైన శాఖాపూర్‌లో ఉంటున్నారు. నవీన్‌కుమార్ భార్య మెదక్ జిల్లా చిలిపిచేడ్ మండల కేంద్రంలోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో టీచర్‌గా విధులు నిర్వర్తిస్తుంది. మృతులకు రెండేళ్ల కూతురు సాయి హిమని ఉంది.

డివైడర్‌ను ఢీకొని వ్యక్తి...


అభిజిత్ మృతదేహం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివైడర్‌ను ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీలో జరిగింది. పోలీసుల వివరాలు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తెనాలి ప్రాంతానికి చెందిన అభిజిత్ (23) జీవనోపాధి కోసం ఐదు నెలల క్రితం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్‌ఐజీ కాలనీకి వచ్చాడు. రిలయన్స్ డిజిటల్‌లో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మోటార్ సైకిల్‌పై స్నేహితుడిని లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో దింపి ఇంటికి వస్తున్నాడు. ఎల్‌ఐజీ కాలనీ సమీపంలో బైక్‌ను డివైడర్‌కు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి ఏడాది క్రితమే వివాహం జరిగింది. అతని తండ్రి శశికేశవరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిన్నారంలో అర్ధరాత్రి ఉద్రిక్తత

- మహిళ మృతదేహాన్ని ఖననం చేయొద్దని అడ్డగింత


నాయకులతో మాట్లాడుతున్న పోలీసులు

జిన్నారం(పటాన్‌చెరు): మహిళ మృతదేహం ఖననం విషయంలో ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఆదివారం రాత్రి 10 గంటలకు జిన్నారంలో ఖననం చేయడానికి గుంత తీస్తుండటంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఇక్కడ ఖననం చేయవద్దని అడ్డగించడంతో ఓ వర్గం వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆదివారం అర్ధరాత్రి ఘటనా కాలనీకి చేరుకున్నారు. అనంతరం సీఐ ఆధ్వర్యంలో మృతదేహాన్ని ఖననం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సోమవారం ఉదయం ఆ ప్రాంతంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

పోస్టర్ ఆవిష్కరణ

సిద్దిపేట ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 4వ తేదీన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రజా ఉద్యమంలో గద్దర్ పాత్రపై చర్చా గోష్ఠి నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ ప్రసాద్ తెలిపారు. సోమవారం కార్యక్రమ పోస్టర్‌ను కళాశాలలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ, రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత కాత్యాయని విద్మహే, దేశపతి శ్రీనివాస్‌లు కీలకోపాన్యాసం చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో చరిత్ర విభాగాధిపతి కొలిపాక శ్రీనివాస్, మహేందర్, హుస్సేన్, మధుసూదన్, గోపాల సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

● ప్రమాదకర ప్రయాణం

ట్రాక్టర్‌పై పిల్లలతో కుటుంబసమేతంగా ప్రమాదకరంగా వెళ్తున్న వీరంతా బిహార్, ఒరిస్సా, మధ్యప్రదేశ్ ఇతర రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు. వీరు కొన్ని నెలలుగా సిద్దిపేట పట్టణశివారులోని నర్సాపూర్ వద్ద రైల్వే పనులు చేస్తున్నారు. పనులు ముగింపు దశకు చేరుకోవడంతో సొంత గ్రామాలకు వెళ్లేందుకు సిద్దిపేట పట్టణంలోని న్యూబస్టాండ్‌కు ఇలా ట్రాక్టర్ పై వెళ్తూ సాక్షి కెమెరా కంటపడ్డారు.. కష్టజీవులకు కనీసం సరైన రవాణా సౌకర్యం కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే దానికి ఈ దృశ్యం నిదర్శనం.

–సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట




ట్రాక్టర్‌పై ప్రమాదకరంగా ప్రయాణం చేస్తున్న వలసకార్మికులు